

సర్ పేరుతో ఓట్లు తొలగించేందుకు బిజెపి చేస్తున్న కుట్రను తిప్పికొట్టాలి



# సాదా బైనామాలకు మోక్షం ఎప్పుడు?

### ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు
### క్షేత్రస్థాయి ఉద్యోగుల నిర్లక్ష్యంతో దరఖాస్తు దారుల అవస్థలు
### ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిన అమలులో జాప్యం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం/ చౌటుప్పల్ :** రాష్ట్ర ప్రభుత్వం సాదా బైనామాల ఆధారంగా భూ సమస్యల పరిష్కారానికి, అర్హులైన రైతులు , పేదలకు న్యాయం జరిగేలా ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో వాటి అమలు ప్రశ్నార్థకంగా మారింది. సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరి కారణంగా అనేక దరఖాస్తులు ముందుకు కదలకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం సాదా బైనామా పత్రాలు, స్థానిక విచారణ, సంబంధిత ఆధారాలను పరిగణలోకి తీసుకొని దరఖాస్తులను పరిశీలించాల్సి ఉన్నప్పటికీ , కొన్నిచోట్ల కేవలం సాంకేతిక కారణాలు చూపుతూ ఫైళ్లను తిరస్కరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఏళ్ల తరబడి భూములను సాగు చేస్తున్న రైతులు, భూమిపై హక్కులు పొందేందుకు తహసిల్దార్ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.





### సాదాబైనామాలు సంతకాలతోనే సరి ..ఫైళ్లు రిజెక్ట్

భూ సంబంధిత దరఖాస్తుల పరిశీలనలో సాదా బైనామా పత్రాలపై కేవలం సంతకాలు మాత్రమే ఉండడంతో సంబంధిత అధికారులు ఫైళ్లను తిరస్కరిస్తున్నట్లు సమాచారం. సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు చట్టబద్ధ ధృవీకరణ లేకపోవడంతో అనేక దరఖాస్తులు పెండింగ్ లో పడుతున్నాయి. భూముల క్రమబద్ధీకరణ, న్యూట్రిషన్ వారసత్వం మార్పిడి వంటి అంశాలకు సంబంధిత ఫైలను పరిశీలించిన అధికారులు, సాదా బై నామాల ఆధారంగా హక్కులను నిర్ధారించడం సాధ్యం కాదని పేర్కొంటూ తిరస్కరిస్తున్నారు. దీంతో దరఖాస్తుదారులు కార్యాలయాలు చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్లో ఉండటం, అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడం వల్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుంది. ప్రభుత్వ నిర్ణయాల ఉద్దేశం ప్రజలకు ఉపశమనం కల్పించడం కాగా, మిత్ర స్థాయిలో ఉద్యోగుల నిర్లక్ష్యం వల్ల ఆ లక్ష్యం నెరవేరడం లేదని బాధితులు వాపోతున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ఉద్యోగులు ఫైళ్లను పెండింగ్లో ఉంచడం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పెండింగ్లో ఉన్న సాదా బైనామా ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించి ప్రభుత్వ ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, రైతు సంఘం మండల కార్యదర్శి పల్లె మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సామాజిక తెలంగాణ కోసమే ఉద్భవించిన టిఆర్ఎల్‌డి

### హుజూర్‌నగర్‌లో టిఆర్ఎల్‌డి పార్టీ కార్యాలయం ప్రారంభం
### మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఎందరో బలిదానాల వల్ల వచ్చిన తెలంగాణలో సామాజిక తెలంగాణ కోసమే టిఆర్ఎల్‌డి పార్టీ ఉద్భవించిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ తెలిపారు. బుధవారం హుజూర్‌నగర్‌లో తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ (టిఆర్ఎల్‌డి) సూర్యాపేట జిల్లా కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సోమగాని నరేందర్‌గౌడ్, జిల్లా ఇన్‌ఛార్జి గౌర బీరప్ప లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిఆర్ఎల్‌డి నుండి ఎమ్మెల్యే, ఎంపిలతో పాటు అన్ని ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు దొందుదొందేనన్నారు. పెన్షన్ విధానాల్లో మార్పులు తీసుకవస్తామని ప్రతి పెన్షన్ దారునికి న్యాయం చేస్తామని చెప్పి రేవంత్‌రెడ్డి సర్కార్ మోసం చేసిందని అరోపించారు. ఎన్నికల సమీపిస్తున్న ఈ తరుణంలో కొత్త పెన్షన్‌ల బూచి చూపించి ప్రజలను మోసం చేసేందుకు సర్కార్ యత్నిస్తుందన్నారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ల ఊసేలేదని అరోపించారు. గూడు లేని నిరుపేదలకు ఇండ్లు ఇచ్చే పరిస్థితి లేదని, ఇక్కడ ఉత్తమ్ మోడల్ కాలనీ కడుతున్నామని, జాప్యం చేస్తూ మోసం చేస్తున్నారని అరోపించారు. రేషన్‌కార్డు ఇచ్చిన వారికి గృహజ్యోతి అందడంలేదని, గ్యాస్ సబ్సిడీలో పురోగతి లేదన్నారు. హుజూర్‌నగర్‌లో బిఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వాన్ని నడిపే శక్తి లేదని, బిజేపి పార్టీ ఇక్కడ పడుకుందని ఎద్దేవా చేశారు. అవినీతి రహిత సమాజం కోసం చదువుకున్న యువత ముందుకు రావాలన్నారు. ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు పట్టణంలో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్

**ప్రజాపక్షం/దేవరకొండ:** మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం దేవరకొండ పట్టణంలోని 8వ వార్డు, 20వ వార్డులో మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమం దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ నిర్వహించనున్నారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నగరాభివృద్ధి నిధులతో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

## నేటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 21 వరకు నల్గొండ జిల్లా మిర్యాలగూడలో మెన్ అండ్ ఉమెన్ సింగిల్స్, డబుల్, మిక్స్ డబుల్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ అంజయ్య ,అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ప్రశాంత్, నవీన్ కుమార్, జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ తెలిపారు. మిర్యాలగూడలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... పట్టణంలోని క్లియో స్పోర్ట్స్ ఎరీనా ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలలో రాష్ట్రంలోని సుమారు 30 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నట్లు వారు తెలిపారు. పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పోటీలను పరిశీలించేందుకు నేషనల్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ సైతం హాజరుకానున్నట్లు తెలిపారు.

## డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు ఘన స్వాగతం

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు సూర్యాపేటలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. మంగళగిరికి వెళ్తున్న సందర్భంగా ఆయన సూర్యాపేట మీదుగా ప్రయాణించగా ఉమ్మడి నల్లగొండ జిల్లా జనసేన పార్టీ ఇన్‌ఛార్జి సతీష్‌రెడ్డి, సూర్యాపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి ఎవి రావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ కు అభిమానులు, కార్యకర్తలంటే ఎంతో అభిమానం ఉందని తెలిపారు. అభిమానుల్లో ఎవరికైన ఇబ్బంది కలిగితే వెంటనే స్పందించే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఎంత బిజి షెడ్యూల్ ఉన్నప్పటికీ అభిమానుల కోసం సమయం కేటాయించి వారిని పరామర్శిస్తారని చెప్పారు. ఇటీవల ఢిల్లీలో బిజి కార్యక్రమాల్లో పాల్గొన్నప్పటికీ అభిమానుల కోరిక మేరకు వారిని కలుసుకుని ధైర్యం చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అభిమానుల పట్ల ఆయనకు ఉన్న అప్యాయతకు ఇది నిదర్శనమన్నారు. తెలంగాణలో కూడా జనసేన పార్టీ కార్యకలపాలు విస్తరిస్తున్నాయని, భవిష్యత్‌లో ఎన్నికల్లో మరింత బలంగా పోటీ చేస్తామని నాయకులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే జనసేన లక్ష్యమని, ప్రజల పక్షాన పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. అనంతరం కార్యకర్తలు జై జనసేన జై పవన్ కళ్యాణ్ నినాదాలతో సభ ప్రాంగణాన్ని మార్మోగించారు. ఈ కార్యక్రమంలో అనన్మియా, వెంకటేష్, అశోక్, రవి, ఓర్సు రవి, లింగరాజు, సైదులు, విక్రమ్, సైదులు నాయక్, అభిమానులు పాల్గొన్నారు.



# నూతన తహసీల్దార్‌గా ఎల్.మంగా బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల తహసీల్దార్‌గా సోంపంగు సూరయ్య బదిలీపై వెళ్లగా మఠంపల్లి మండలం నుండి బదిలీపై నడిగూడెం మండలానికి నూతన తహసీల్దార్‌గా ఎల్. మంగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు

# అన్నదాన కార్యక్రమం



**ప్రజాపక్షం/అనంతగిరి:** తెలంగాణ శబరిమల అనంతగిరి శ్రీ అయ్యప్ప స్వామి సన్నిధిలో భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి బుధవారం జరిగే అన్నదాన కార్యక్రమంలా మండల పరిధిలోని మొగలాయికోట గ్రామానికి చెందిన కోళ్లూరి మహాలక్ష్మయ్య గురుస్వామి, జయమ్మ, నెలకొండపల్లి గ్రామానికి చెందిన భూక్య ఉపేందర్, సుక్కి దంపతుల కుమార్తె హారిక జన్మదినం సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ కొండపల్లి వాసు, కక్కిరేణి ప్రభాకర్, పొనుగోటి కనకయ్య, రవీందర్, కోళ్లూరి రాంగోపాల్, కుక్కడపు గోపాలకృష్ణ, రమేష్, నర్సింహారావు పాల్గొన్నారు.

# ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సదుపాయా లతో పాటు నాణ్యమైన విద్య అందడం జరుగు తున్నదని చందెపల్లి సర్పంచ్ బొట్ల నగేష్ అన్నారు. బుధవారం చందెపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను రాత పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని, త్వరలో బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీపతి నరేందర్, ఉపాధ్యాయురాలు మదూరి విజయ, తల్లిదండ్రులు మహేష్, సోనీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ అడ్మిషన్లకు 21 వరకు అవకాశం

**ప్రజాపక్షం/నకిరేకల్:** నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026/27 విద్యాసంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలకు ఈ నెల 21 వరకు గడువు ఉందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బెల్లి యాదయ్య తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ (బీజడ్‌సీ, ఎంపీసీ) కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ట్యూషన్ ఫీజు లేకుండా విద్యతో పాటు స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. నకిరేకల్ పరిసర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంటుందని చెప్పారు. అన్ని సౌకర్యాలతో మన ప్రాంతంలో కాలేజీ ఉండగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. చదువు క్రమశిక్షణ మా ప్రత్యేకతను తెలిపారు. మరిన్ని వివరాలకు 9848392690, 9542731841, 9703277261 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# మహా పూర్ణాహుతి కార్యక్రమంలో ఎమ్మెల్యే కుంభం

**ప్రజాపక్షం/భువనగిరి :** గత 33 రోజులుగా ప్రతి రోజు జరుగుతున్న శ్రీ త్రిశక్తి మహా గాయత్రి జ్ఞాన యజ్ఞానికి మహా పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. వ్యవస్థాపకులు దివ్యజ్ఞాన గురూజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దిగ్విజయం చేశారు. వరంగల్ హైవే బైపాస్ రోడ్డు నుండి మందిరం వరకు సిసి రోడ్డు వేసిన సందర్భంగా లాంఛనంగా బుధవారం ప్రారంభోత్సవం కూడా జరిగింది. సమాజ శ్రేయస్సుకై లోక కళ్యాణార్థం భువనగిరి నియోజకవర్గంలోని ప్రజలందరూ క్షేమంగా ఉండాలని అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ అమ్మవారి ఆశీస్సులు గురూజీ ద్వారా ఎమ్మెల్యే అందుకున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక



మున్సిపాలిటీ చైర్ పర్సన్ శ్రీమతి తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, దంపతులు వైస్ చైర్మన్ దంపతులు పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, తోటకూర వెంకటేష్ యాదవ్, స్థానిక కోర్టు డిపి చందుపట్ల రజిని విశ్వేశ్వర్ రావు , గాయత్రి చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు చందుపట్ల వెంకటేశ్వర్‌రావు, అధ్యక్షులు డాక్టర్, కె.రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

# మేరు కులస్థుల సంక్షేమమే ధ్యేయం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతితో పాటు మేరు బంధువుల సర్వతోముఖాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా మేరు కుల సేవా సంఘం అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి కొనియాడారు. మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో మేరు కుల సేవా సంఘం ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఉచిత మేరు కుల వధూవరుల పరిచయ వేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఎంపిక చేసిన మేరు కార్పొరేషన్ చైర్మన్ సంగం వెంకటరాజం మేరు, వైస్ చైర్మన్ మాడిశెట్టి లక్ష్మీ నారాయణ మేరులను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మేరు కులస్థుల ఐక్యత, ఆర్థిక, సామాజిక ఎదుగుదల కోసం సంఘం నిరంతరం చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఈ అద్భుతమైన పరిచయ వేదిక మరియు సన్మాన కార్యక్రమంలో మేరు కుల సేవా సంఘం రాష్ట్ర, జిల్లా స్థాయి ముఖ్య నాయకులు, సంఘం పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి





**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లల కోసం ప్రత్యేక పౌష్టికహారాన్ని అందజేయడం జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్ కోరారు. బుధవారం 5వ, 7వ అంగన్‌వాడీ కేంద్రాలలో సామూహిక అక్షరభ్యాసం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టబోయే శిశువులు, చిన్నారులు మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్‌రావు, కౌన్సిలర్లు చిట్టిపోతుల భద్రమ్మ, బెల్లంకొండ సంధ్య అమర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నిర్మల, టీచర్లు రజని, సామాజిక కార్యకర్త రాము పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మండలంలోని బూరుగడ్డ, మాచవరం ప్రాథమిక పాఠశాలలో బుధవారం అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పులువురు చిన్నారుల చేత సర్పంచ్ యరగాని రాధ నాగరాజు అక్షరాభ్యాసం చేయించారు. అలాగే ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలను, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ గడ్డం నాగయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, పద్మ, నర్సింహారావు, పెండెం మట్టపల్లి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పాల్గొన్నారు.

# డిఎంహెచ్‌ఓగా రాహుల్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా (డీఎంహెచ్ఓ) డాక్టర్ రాహుల్ బుధవారం పూర్తిస్థాయి బాధ్యతలను స్వీకరించారు.బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విధుల్లో చేరినట్లు నివేదించి అనుమతి తీసుకున్నారు.డాక్టర్ రాహుల్‌కు వైద్య ఆరోగ్యశాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన సుదీర్ఘ పరిపాలనా అనుభవం ఉంది. గతంలో నల్లగొండ జిల్లా కోవిడ్ నియంత్రణ సెల్ ప్రత్యేక అధికారిగా పనిచేసి కరోనా విపత్కర పరిస్థితుల్లో విశేష సేవలు అందించారు.అలాగే జిల్లా క్షయ వ్యాధి (టీబీ) నియంత్రణ అధికారిగా విధులు నిర్వహిస్తూ వ్యాధి నిర్మూలనకు కృషి చేశారు.దేవరకొండ



డిప్యూటీ డీఎంహెచ్ఓగా పనిచేసిన సమయంలో క్షేత్రస్థాయిలో వైద్య సేవల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించారు.సహోద్యోగులు,సిబ్బందితో సత్సంబంధాలు కొనసాగిస్తూ బృందస్ఫూర్తితో పనిచేసే అధికారిగా డాక్టర్ రాహుల్‌కు మంచి గుర్తింపు ఉంది. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలు,సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో ఆయనకు విశేష అనుభవం ఉంది. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మరింత నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందుతాయని జిల్లా ప్రజలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని మండల విద్యాధికారి భూక్య సైదానాయక్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని అంజలిపురం గ్రామంలో 15 సంవత్సరాల సుదీర్ఘ విరామానంతరం జీవో ఎన్‌రోల్‌మెంట్ ప్రాథమిక పాఠశాలను సర్పంచ్ గోలి శ్రీనివాస్, మండల విద్యాధికారి సైదానాయక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పెనుగొండ శ్రీనివాస్ లు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని అందువల్ల విద్యార్థులు ప్రభుత్వ బడిలోనే చేర్పించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందునాయక్, సిఆర్‌పి సైదులు, పట్టేటి సునిత, ఎర్రం సీత, ఆవులదొడ్డి గంగ నర్సింహారావు, కార్యదర్శి సైదులు, ఫీల్డ్ అసిస్టెంట్ రవిబాబు పాల్గొన్నారు.

# పాఠశాలలో పునః ప్రారంభ వేడుకలు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** పాఠశాలలు పునః ప్రారంభం అయిన సందర్భంగా భువనగిరి మండలంలోని తాజ్ పూర్ గ్రామంలోప ఎంపియుపిఎస్ పాఠశాలలో గౌరవ సర్పంచ్ ర్యాకల సంతోష్ శ్రీనివాస్ పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభ వేడుకలు నిర్వహించారు. తదుపరి అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి నూతనంగా మంజూరైన ఆర్ఓ ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించడం జరిగింది. సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో పునరుద్ధరించామని ప్రత్యేక డిజిటల్ క్లాసులు, నాణ్యమైన విద్యను వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త డా.ర్యాకల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, మహ్మద్ గాలిబ్ యాకుబ్, బొమ్మారపు రామకృష్ణ, బొమ్మారపు లక్ష్మి బాలరాజ్, బీట్కూరి మహేష్ పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞాన అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో అన్న, అక్క మెంటర్ షిప్ కార్యక్రమానికి అనుబంధంగా డిజిటల్ లెర్నింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఈనెల 17, 18 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఐదవ సెమిస్టర్‌లో భాగంగా తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్ షిప్ కార్యక్రమ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అధ్యాపకులు డాక్టర్ జనార్దన్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ లెర్నింగ్ పరిజ్ఞాన వినియోగం తదితర అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఐక్యుసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నీలిమతోపాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గురుకులాలకు విద్యార్థుల ఎంపిక

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల పరిధిలోని సిరిపురం ప్రాథమిక పాఠశాల 1 నుంచి 2026/27 విద్యా సంవత్సరానికి గానూ ఆరు గురు విద్యార్థులు గురుకులానికి ఎంపికైనట్లు హెచ్ఎం ప్రవీణ తెలిపారు. పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న కీర్తిక, నిహారిక, పూజ, దీక్షిత, 5వ తరగతి చదువుతున్న జశ్వంత్, లక్ష్మి శ్రీనివాస్ ఎంపికయ్యారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.



## పేదల వైద్యానికి ప్రభుత్వం భరోసా

ప్రజాపక్షం/నకిరేకల్ : పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కేతపల్లి మండలం గుడివాడ గ్రామానికి చెందిన కుమ్మరికుంట్ల శివకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఎల్ఓసి ద్వారా మంజూరైన రూ.1.50 లక్షల చెక్కును బుధవారం తన నివాసంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.ఆర్థిక ఇబ్బందులతో చికిత్సకు దూరమవుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పోలీస్ కానిస్టేబుల్ పరీక్షకు ఉచిత శిక్షణపై అవగాహన

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణం లోని కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న పోలీస్ కానిస్టేబుల్ ఎగ్జామ్స్ కు సంబంధించి ఈ నెల 18న ఉదయం 11 గంటలకు కళాశాలలో ఉచిత అవగాహన తరగతులను నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.భీమార్జునరెడ్డి ప్రకటించారు. మిర్యాలగూడ పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన, అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు తరగతులకు హాజరు కావాలని ఆయన తెలిపారు. అవగాహనా సదస్సు తర్వాత పోలీస్ కానిస్టేబుల్ పోటీ పరీక్షకు ఉచిత కోచింగ్ తరగతులు నిర్వహించబడుతాయని, ప్రతీ వారం పరీక్షలు నిర్వహించి పోటీ పరీక్షల్లో నెగ్గే విధంగా అభ్యర్థులను తయారు చేస్తామని, సదవకాశాన్ని అర్హతలున్న అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు.

## దైద రవీందర్ జన్మదినం

ప్రజాపక్షం/నకిరేకల్ : టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి, నాయకులు నర్సింగ్ మహేష్ గౌడ్, వంటేపాక నక్షత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం తాటికల్లు శివారులోని లయన్స్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగూరి ప్రసాద్, గోసుకొండ రమేష్, వంటపాక దాసు,దైద సురేష్,పట్టేటి వెంకటేష్,కక్కిరేణి శివ,గూడపూరి వెంకటేష్,పాలడుగు నరేష్,నకిరకంటి మధు,చెరువు పెళ్లి సైదులు, పశుపతి, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టు పిల్లలకు ఫీజులో రాయితీ సర్క్యులర్ జారీ చేయాలి

అధికారులకు టియుడబ్ల్యుజె జిల్లా కమిటీ విజ్ఞప్తి

తక్షణమే సర్క్యులర్ జారీకి చర్యలు తీసుకుంటామని హామీ



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: జిల్లాలోని జర్నలిస్టు కుటుంబ సభ్యుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలలో ఫీజులో 75 శాతం నుంచి 100 శాతం వరకు రాయితీకి సంబంధించిన సర్క్యులర్ ను వెంటనే జారీ చేయాలని టియుడబ్ల్యుజే(ఐజేయు) జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది.ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఫీజులో రాయితీకి సంబంధించిన సర్క్యులర్ కోసం ఈ నెల 5వ తేదీన జిల్లా విద్యాశాఖ అధికారికి విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. అయితే సాంకేతిక కారణాలతో సర్క్యులర్ జారీలో ఆలస్యం జరిగిందని తెలిపారు. పాఠశాలలు పునః ప్రారంభమైన దృష్ట్యా పేద మధ్యతరగతి కుటుంబాలు అధికంగా ఉన్న జర్నలిస్ట్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. ఇతర జిల్లాలలో జారీ అయిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో పాటు అందుకు సంబంధించిన ప్రతులను కూడా అందించారు.జర్నలిస్టుల సంక్షేమం దృష్ట్యా తక్షణమే సర్క్యులర్ జారీకి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఎలక్ట్రాన్ మీడియా ప్రధాన కార్యదర్శి దోటి శ్రీనివాస్,చిన్న పత్రికల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల రామకృష్ణ,జిల్లా ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి కంచర్ల అంజయ్య,జిల్లా నాయకులు తెలగమళ్ల దశరథ,వినోద్,సూరారపు ప్రసాద్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ సాగుతోనే అధిక లాభాలు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఆధునిక వ్యవసాయంలో భూసార నిర్వహణ అత్యంత కీలకమని, రైతులు జీలుగులు మరియు జనుముల విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఏర్పాటు చేసిన పచ్చిరొట్ట ఎరువుల బస్తాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, సాగుదారులకు విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే ఒగా ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలను చేపడుతోందన్నారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా భూమి సారవంతంగా మారుతుందన్నారు. నియోజకవర్గ వ్యవసాయాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ పంపిణీ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు కొనిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి, పాక్స్ చైర్మన్ బంటు శ్రీనివాస్, ఆత్మ చైర్మన్ బ్రహ్మానంద రెడ్డి, నేతలు గాయం ఉపేందర్ రెడ్డి, నర్సిరెడ్డి, పొదిల్ల శీను, బసవయ్య గౌడ్ హాజరయ్యారు. వీరితో పాటు పీఏసీఎస్ డైరెక్టర్ల మండలి సభ్యులు పల్నాటి జానకి రెడ్డి, సిగపట్ల నాగయ్య, పోలగాని వెంకటేష్ గౌడ్, బంటు వెంకటేశ్వర్లు, రామ్ రెడ్డి పాల్గొన్నారు.

# ఎలక్ట్రికల్ స్కూటీని ఉపయోగించి పర్యావరణాన్ని పరిరక్షించండి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : పర్యావరణ ను పరిరక్షించి ఇంధన పొదుపు కి తోడ్పాటు అందించేందుకు ప్రతి ఒక్కరు ఎలక్ట్రిక్ స్కూటీ ఉపయోగించాలని టీవీ ఆర్టిస్ట్ లోహిత్ కుమార్ సూచించారు.బుధవారం నల్లగొండ పట్టణం లోని విద్యుత్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసి న సోనూ ఎంటర్ ప్రైజెస్ ఎలక్ట్రిక్ స్కూటీ షోరూంని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఎలక్ట్రిక్ స్కూటీని వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించచడంతోపాటు ఇంధనం పదుపు చేసుకోవచ్చని అన్నారు. నల్లగొండలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ షోరూంలో ఎలక్ట్రిక్ స్కూటీ లు సామాన్య మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరలో అందించడం జరుగుతుందని అన్నారు.అదేవిధంగా ఆల్కాలైన్ వాటర్ ఫిల్టర్లు సబ్సిడీ తో కూడిన సోలార్ లు కూ డ షోరూం లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.ప్రొప్రైటర్ కొండోజు నరసింహా చారి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ స్కూటీలో అందరికీ అందుబాటులో ఉన్నాయని ఈఅవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కంపెనీ యాజమాన్యం.లీడర్స్,పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అన్నదానం - సేవా కార్యక్రమాలతో జన్మదినం



ప్రజాపక్షం/నార్కట్‌పల్లి : కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గ టీపీసీసీ కార్యదర్శి దైద రవీందర్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నిరుపేదల ఆకలి నిలయం మనం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 592వ రోజున బిక్షాటన,నిరుపేదలు, బాటసారులు, నిస్సహాయులైన 100 మందికి అన్నదానం చేశారు.ఈ సందర్భంగా దైద రవీందర్ మాట్లాడుతూ ప్రజల మధ్య నిత్యం ఉండి సమాజ సేవ చేసే వ్యక్తినని తెలిపారు.ఈ సంస్థను ఎన్నో రోజులుగా చూస్తున్నానని, ప్రతిరోజూ 100 మందికి ఉచిత భోజనం అందించడం చాలా గొప్ప విషయమన్నారు. నిష్ఠ,నిబద్ధత కలిగిన సంస్థకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో విక్రమాచారి,గుంటూరి ఈశ్వర్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల్లో భరోసా నింపాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రాష్ట్రంలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి వారిలో భరోసా నింపేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్ కోరారు. మిర్యాలగూడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం జరగబోయే రాష్ట్ర మంత్రిమండలి సమావేశంపై ఉద్యోగులందరూ ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. గత ప్రభుత్వం కాలం నుండి పెండింగ్‌లో ఉండిపోయిన పీఆర్సీ, డీఏల అంశాన్ని ఈ సమావేశంలో అజెండాగా పెట్టి చర్చించాలని, వెంటనే సానుకూల నిర్ణయాన్ని ప్రకటించాలని కోరారు. గత మూడేళ్లుగా పే రివిజన్ కమిషన్ ప్రకటన రాకపోవడంతో ఉద్యోగ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, కాలయాపన చేయకుండా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిర్ణయం కోసం లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు వేచి చూస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉద్యోగ సంఘాల ముఖ్య నాయకులు మక్లా నాయక్, గోపి, సైదా నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో విద్యాలయాలు కలకల



ప్రజాపక్షం/నకిరేకల్ : వేసవి సెలవులు ముగియడంతో ఈ నెల 15 నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. అయితే సోమవారం అమావాస్య, మంగళవారం సెంటిమెంట్ కారణంగా తొలి రోజుల్లో విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా తగ్గింది.బుధవారం మాత్రం ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల రాకతో కళకళలాడాయి.ఉదయం నుంచే తల్లిదండ్రులు విద్యార్థులను సిద్ధం చేసి పాఠశాలలకు పంపించారు. కొందరు విద్యార్థులు బైకులపై, మరికొందరు ఆటోలు,బస్సుల ద్వారా పాఠశాలలకు చేరుకోవడంతో విద్యాలయాల పరిసరాలు సందడిగా మారాయి. ఆడుతూ పాడుతూ తొలి రోజు పాఠశాలలు పూర్తిస్థాయిలో ప్రారంభం కావడంతో విద్యార్థులు,తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల్లో ఆనందం వ్యక్తమైంది. విద్యార్థుల సందడితో పాఠశాలలు మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకున్నాయి.

# నూతన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఎన్నిక





ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల యాదాద్రి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో నూతన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఎన్నిక ఆలేరులో జరిగింది. ఈ కార్యక్రమంలో గుండాల, అడ్డగూడూరు, మోత్కూర్ , ఆలేరు మండలాలకు చెందిన మహిళా రైతు సభ్యులు, ఏపిఎంలు, సిసిలు పాల్గొన్నారు. జిల్లా స్థాయి అధికారులు హాజరై ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. జిల్లా ఏపిడి, డిపిఎం కవిత జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు, మండల సమాఖ్య అధ్యక్షులు, ఎఫ్‌పిసి సీఈవో, ప్రజా ప్రతినిధులు పాల్గొని ఎన్నికలను నిర్వహించారు. నూతన బోర్డ్ సభ్యులు రైతుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి, వ్యాపార అవకాశాల విస్తరణకు కృషి చేయాలని సమావేశంలో పాల్గొన్న అధికారులు ఆకాంక్షించారు.

# దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం కేంద్రంలోని స్థానిక తెలంగాణ ఆదర్శ పాఠశాల లో ఖాళీగా ఉన్న పిజిటి కామర్స్, టిజిటి ఇంగ్లీష్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. పిజిటి పోస్టుకు సంబంధించిన సబ్జెక్టులో పిజితో పాటు బిఈడి పూర్తి చేసి ఉండాలని, టిజిటి పోస్టుకు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ తో పాటు బిఈడి మరియు టీఈటిలో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. జూన్ 20వ తేదీ దరఖాస్తుకు చివరి తేదీ అని, డెమో మరియు ఇంటర్వ్యూ తేదీ జూన్ 23న తెలంగాణ ఆదర్శ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9182078819ను సంప్రదించాలని తెలిపారు.

## నేటి నుంచి యూరియా

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల రైతులు నేటి నుండి యూరియా ఆన్లైన్లో బుక్ చేసుకోవచ్చు. కొత్త స్టాక్ యూరియా ఉదయం 7.00 గంటలకు మరియు మధ్యాహ్నం 3.00 గంటలకు ఆన్లైన్‌లో పెట్టడం జరుగుతుంది. కావున రైతులు ఈ సూచనల ప్రకారం యూరియా బుక్ చేసుకోగలరని మండల వ్యవసాయ అధికారి ఎజాజ్ అలీ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పరిశీలన



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండలంలోని రామన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను , లబ్ధిదారుల గుడిసెలను (తాత్కాలిక నివాసాలను) మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ.రాములు, హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.సునీల్, హౌసింగ్ ఏఈ సురేష్ క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. నిర్మాణాల పురోగతిని పర్యవేక్షిం చి, పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు, లబ్ధిదారులకు అవసరమైన సూచనలు చేశారు.

## పాఠ్యపుస్తకాలు పంపిణీ



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మన్నెవారి తుర్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపరశాల విద్యార్థులకు గ్రామం సర్పంచ్ సోమల్ల వెంకటేశ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సోమల్ల వెంకటేశ్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని మంచి ఫలితాలు సాధించాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ది బిక్షమయ్య, పలుగుల సతీశ్ కుమార్, జ్యోతి, ముసుకుల సుజాత, చింతలపూడి విశ్వేశ్వర రావు, బీరెల్లి హరిత, బండి మధుకర్, రాజమైన అంబాజీ, అదరాసుపల్లి వెంకటలక్ష్మి , భూక్య గోవింద్ పాల్గొన్నారు.

## ఇంజన్ లోపంతో కారు దగ్ధం

**ప్రజాపక్షం/చివ్వెంల** ః ఇంజన్ లోపం కారణంగా కారు దగ్ధమైన సంఘటన మండలంలోని వట్టి ఖమ్మంపహాడ్ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా సుబ్బిలేడు గ్రామానికి చెం దిన బత్తుల వెంకటనారాయణకు చెందిన డస్టర్ కారులో ఇంజన్‌లో లోపం కారణంగా కారు పూ ర్తిగా కాలి బూడిద అయ్యింది. ఈ ప్రమాదంలో కారులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



# జిల్లా టాపర్ దివ్యశ్రీకి రూ.25 వేల చెక్కు అందజేత



**ప్రజాపక్షం/నాంపల్లి** :ఉన్నత చదువులకు సిద్ధమవుతున్న విద్యార్థినికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి నగదు సహకారం అందించారు.పట్టణ కేంద్రానికి చెందిన కామిశెట్టి దివ్యశ్రీ 2024/25 విద్యా సంవత్సరంలో 12వ తరగతిలో జిల్లా టాపర్‌గా నిలిచింది.ప్రస్తుతం ఉన్నత విద్యకు ప్రిపేర్ అవుతున్న దివ్యశ్రీకి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి రూ.25 వేల రూపాయల చెక్కును బుధవారం మండల కాంగ్రెస్ నాయకుల ద్వారా అందించారు.యూపీఎస్సీకి ప్రిపేర్ అవుతున్న దివ్యశ్రీకి ఎప్పుడూ మండల కాంగ్రెస్ కమిటీ తరఫున సహాయ సహకారాలు అందిస్తామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి అన్నారు.దివ్యశ్రీ మాట్లాడుతూ తన ఆశయాలు సాధించేందుకు కష్టపడతానని,తనకు ప్రోత్సాహకరంగా వెన్నంటి ఉంటున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డికి,మండల కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏరెడ్ల రఘుపతి రెడ్డి,పెద్దిరెడ్డి రాజు,మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య,నాంపల్లి పట్టణ ఉప సర్పంచ్ పానుగంటి వెంకటయ్య గౌడ్,నాయకులు సుధాకర్ రెడ్డి, రఘుపతి రెడ్డి,నాంపల్లి మండల యాదవ సంఘం అధ్యక్షుడు అబ్బనబోయిన ఏడుకొండలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నకిరేకల్ సెంటర్లో గజిబిజి



ప్రజాపక్షం/నకిరేకల్ : పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో పాటు ఉద్యోగ,వ్యాపార అవసరాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజల రాకపోకలు పెరగడంతో నకిరేకల్ పట్టణంలోని ఇందిరాగాంధీ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సులు,స్కూల్ బస్సులు, ఆటోలు,ప్రైవేటు వాహనాలు,ద్విచక్ర వాహనాలు ఒకే సారి రోడ్డుపైకి రావడంతో కూడలి వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి.తిప్పర్తి రోడ్డు,సూర్యాపేట రోడ్డు,మూసి రోడ్డు మార్గాల్లో వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా మూసి రోడ్డులో పలు విద్యాసంస్థలు ఉండటంతో స్కూల్ బస్సులు,ఇతర వాహనాలు ఒకేసారి రావడం వల్ల ట్రాఫిక్ నిలిచిపోతున్న పరిస్థితి నెలకొంది. విద్యార్థులు పాఠశాలలకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్‌కు వెళ్లాల్సిన కొన్ని ఆర్టీసీ బస్సులు ఇందిరా గాంధీ సెంటర్‌లోనే ప్రయాణికులను ఎక్కించడం, దింపడం వల్ల రద్దీ మరింత పెరుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. కూడలిలో వాహనాలు ఎదురెదురుగా నిలిచిపోవడంతో పలుమార్లు ట్రాఫిక్ స్తంభిస్తోంది.పాఠశాలలు,కళాశాలల కార్యకలాపాలు పూర్తి స్థాయిలో ప్రారంభమవుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని, అవసరమైన చోట ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని,ఆర్టీసీ బస్సులు నిర్దేశిత బస్టాండ్‌లోనే ఆగేలా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం...



**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** నేరేడుగొమ్ము మండలం పరిధిలోని జోడుబావి తండా గ్రామంలో బుధవారం దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ వీధుల్లో ఎంఎల్‌ఏ బాలునాయక్, సర్పంచ్ బానావత్ మంజునాథ్‌తో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల వద్దకే వెళ్ళి సమస్యలను తెలుసుకొని సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వెంటనే సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం అని ఎంఎల్‌ఏ తెలిపారు. అనంతరం జోడుబావి తండాలో రూ. 10లక్షలతో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య సంఘ భవనాన్ని ఎంఎల్‌ఏ బాలునాయక్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక సామాజిక సాధికారతకు ఈ భవనం ఒక వేదికగా నిలుస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** ః తాము చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థులు చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు గోలి పద్మ తెలిపారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1975/76 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు సుమారు రూ.1.50వేలతో వంటగది నిర్మించగా ఆమె దానిని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న మధ్యాహ్న భోజనం ఆరుబయట వంటలు చేస్తుండడంతో నూతన గది నిర్మాణానికి పూర్వ విద్యార్థులు సహకరించడం అభినందనీయమన్నారు. తాము చదువుకున్న పాఠశాలకు మౌలిక వసతుల కొరకు, ఇదే పాఠశాలలో చదువుకొని ప్రయోజకులైన పలువురు నాటి విద్యార్థుల సేవలు మరువలేనివి అన్నారు. ప్రతి ఒక్కరు తాము చదువుకున్న ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థికంగా సహకారం అందించిన నాటి విద్యార్థుల గురువులు వెంకట్‌రెడ్డి, కిషన్ రావు, పూర్వ విద్యార్థులు డాక్టర్ శరత్, శాస్త్రి, పోతుగంటి వెంకట లక్ష్మి నారాయణ, ఉప్పల రమేష్, రాజా, భాస్కర్, రహీం, ధనేష్, సురేష్, సాంబయ్య పాల్గొన్నారు.



## చిన్నారులకు ఎమ్మెల్సీ ఆశీర్వాదం

**ప్రజాపక్షం/నాంపల్లి** : మండల కేంద్రంలోని శ్రీ శ్రీనివాస కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన నూతన పట్టు వస్త్రలంకరణ మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.తిరుమలగిరి గ్రామానికి చెందిన మేడబోయిన అనిత,దివంగత వేణుగోపాల్ యాదవ్ దంపతుల కుమారుడు అచ్యుత్,కుమార్తె సంజనల నూతన పట్టు వస్త్రలంకరణ మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా చిన్నారులకు ఆశీస్సులు అందజేసి వారి ఉజ్వల భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్యచారి, మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## సామూహిక అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం /హాలియా:** సామూహిక అక్షరాభ్యాసం,ప్రీ ప్రైమరీ తరగతుల ప్రారంభోత్సవ వేడుకలు కొత్తపల్లి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.బుధవారం కొత్తపల్లి పాఠశాలలో ఈకార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ అలుగుల బ్రహ్మానంద రెడ్డి, ఎంఈఓ రామచంద్రయ్యలు ఈ సామూహిక, ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించారు.ప్రీప్రైమరీ లో అడుగుపెడుతున్న చిన్నారుల విద్యా జీవితానికి శ్రీకారం చుట్టే ఈ వేడుకను పాఠశాల యాజమాన్యం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు విఘ్నేశ్వర పూజ,సరస్వతీ పూజలు నిర్వహించి,వేద పండితుల ఆశీర్వచనాలతో అక్షరాభ్యాసాన్ని సామూహికంగా పూర్తి చేశారు. చిట్టి పొట్టి అడుగులతో బడికి వచ్చిన చిన్నారులకు తమ విద్యా ప్రస్థానం ఘనంగా ప్రారంభించాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ గోవర్ధన్,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కోరేపాక గౌతమి,కొత్తపల్లి జెడ్‌పి హెచ్‌ఎస్ హెచ్ ఎం శ్రీదాస వెంకన్న,సీనియర్ ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి,చింతల వెంకటేశ్వర్లు, ప్రశాంత్,దివ్యలక్ష్మి, సరిత అండాలు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు నియంత్రణ చట్టం తేవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** ః రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టం తీసుకువచ్చి కార్పోరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడిని అరికట్టాలని తెలంగాణ విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జన సమితి కార్యాలయంలో జరిగిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను దోపిడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు విద్య అందరికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని పదే పదే హామీలు ఇస్తున్నప్పటికి అవి కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం రోజురోజుకు భారంగా మారుతోందన్నారు. ఈ సమావేశంలో నాయకులు హర్షవర్ధన్, రింగ్, ముఖేష్, వినయ్‌రాజ్, ప్రణీత్ పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి జన్మదిన వేడుకలు









**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** రాజకీయాల్లో మహిళా నాయకత్వానికి నిలువెత్తు నిదర్శనం ఉత్తమ్ పద్మావతి రెడ్డి అని కాంగ్రెస్ నాయకులు భాషబోయిన భాస్కర్ రావు అన్నారు. బుధవారం మండల వ్యాప్తంగా కోదాడ శాసనసభ్యులు ఉత్తమ్ పద్మావతి రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవను పరమావధిగా భావిస్తూ ప్రజల సంక్షేమం, నియోజక వర్గ అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంది తిరుపతయ్య, రాయపూడి వెంకటనారాయణ, హనుమంతరావు, కాంపాటి శ్రీనివాసరావు, తాటికొండ నాగిరెడ్డి, లక్ష్మి నారాయణ, మహ్మద్ రఫీ, మైకు నాగులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/అనంతగిరి:** కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం మండల పరిధిలోని వాయిలసింగారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈసందర్భంగా సర్పంచ్ నదిగామ శ్రీనివాసులు అనంతరం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షులు గుండ్లపల్లి వెంకన్న, చుండూరు మురళి, మురళి, కొల్లు సుబ్బారావు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/అనంతగిరి:** కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు శ్రీనివాసరెడ్డి కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుర్ర పుల్లారెడ్డి, మాజీ ఎంపిపి చుండూరు వెంకటేశ్వర్లు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాబునాయక్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నడిగూడెం:** నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలో ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో దున్న శ్రీనివాస్, గోసుల రాజేష్, దాట్ల నాగేశ్వరరావు, వేల్పుల సోమయ్య, అట్టూరి పుష్పావతి నగేందర్‌రెడ్డి, పాటికండ్ల రుక్మిణి, రంగయ్య, కంభంపాటి సరిత, కేసగాని సరిత లక్ష్మణ్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మోతె:** మండల వ్యాప్తంగా కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయా గ్రామాల సర్పంచులు కేక్ కట్ చేసి అరటిపండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, వెలుగు వీరన్న, సామ రామిరెడ్డి, వీరారెడ్డి, నారాయణరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, బొర్ర వెంకటేష్, లింగయ్య పాల్గొన్నారు.



## నేటి నుంచి యూరియా సరఫరా

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండలంలో యూరియా బుకింగ్ యాప్ ద్వారా నేటి నుండి యూరియా సరఫరా చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిణి శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతు తమ అవసరమైన యూరియా కోసం బుక్ చేసుకొనేవారు అధికారిక యాప్ ద్వారా మాత్రమే బుకింగ్ చేయాలని సూచించారు. ప్రతి ఉదయం వ్యవసాయ శాఖ ద్వారా ఆ రోజు బుకింగుకు సంబంధించిన సమయం మరియు పంపిణీ స్థలాలు అప్డేట్ చేయబడతాయనీ తెలిపారు. ప్రతి రోజుకు అవసరమైన పరిమాణం మేరకు స్టాక్ అందుబాటులో ఉంచబడుతుందనీ బుక్ చేసుకున్న ప్రతి ఒక్కరికి సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరి పిల్లలను చేర్పించిన ఉపసర్పంచ్



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని మక్త అనంతారం గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ గ్యార మనీషా వెంకటేష్ దంపతులు తమ ఇద్దరు పిల్లలు శోధన శ్రీ నాలుగవ తరగతి బాహుల్య శ్రీలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధర్మారెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మనీషా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. 13మంది విద్యార్థులు చేరారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ దంపతులను ప్రధాన ఉపాధ్యాయులు అభినందించి పాఠశాలకు మరింత మంది విద్యార్థులను చేర్పించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సంధ్యారాణి, గీత, నాగయ్య, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ, సంఘబంధ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, సంఘబంధం భవనాల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపనలు చేశారు. 22 లక్షల రూపాయలతో భవనాల నిర్మాణాలు చేపట్టినట్లు ఎంపిడివో సోమసుందర్‌రెడ్డి తెలిపారు. నిర్ణిత గడువులోగా భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, అంగన్‌వాడీ లో ప్రీప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఉచిత దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో తన కుమార్తెను చేర్పించిన ఉపాధ్యాయుడు

**ప్రజాపక్షం/నడిగూడెం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న విద్యను ఉపాధ్యాయులు అందిస్తున్న బోధనతో విద్యార్థులు ప్రయోగాత్మకంగా అభివృద్ధి చెందుతున్నారని రామాపురం సర్పంచ్ బుత్కూరి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రామాపురం హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో అదే పాఠశాల ఉపాధ్యాయుడు బండ్ల ఏడుకొండలు తన కుమార్తెను ఐదవ తరగతిలో అడ్మిషన్ వేయించాడు. దీంతో సర్పంచ్ ఉపాధ్యాయుడిని ఘనంగా అభినందించారు. అదే విధంగా పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.



## పాఠ్యపుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** మండలంలోని రాయినిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను బుధవారం గ్రామ సర్పంచ్ గుండు రామాంజి గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యతోపాటు పుస్తకాలు, నోట్‌బుక్‌లు, మధ్యాహ్న భోజనం సౌకర్యాలని పొందాలని కోరారు. గ్రామంలో ప్రతి ఒక్క విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శత్రు నాయక్, ఏఏపిసి చైర్మన్ సుహాసిని, గ్రామ కార్యదర్శి సునీత, పాఠశాల హెడ్‌మాస్టర్ నాగమణి, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## రవీందర్‌రెడ్డి మృతి బాధాకరం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** గ్రామ మాజీ సర్పంచ్ వెన్న రవీందర్‌రెడ్డి మృతి చాల బాధకరమని సూర్యపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కోదండరామాపురం గ్రామంలో రవిందర్‌రెడ్డి మృతదేహంపై పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం అనేక రకాల సేవలందించిన రవీందర్‌రెడ్డి మరణం గ్రామానికి తీరనిలోటు అన్నారు. క్యాన్సర్ వ్యాధితో రవీందర్‌రెడ్డి బాధపడుతూ మృతి చెందడం బాధకరమన్నారు. అదే గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన బత్తిని శేఖర్ మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, పిల్లుట్ల రఘు, గుగులోతు కృష్ణనాయక్, కడియం వెంకటరెడ్డి, గుత్తికొండ ప్రమీల వెంకటరమణారెడ్డి, మాశెట్టి శ్రీహరి, రాంసైదులు, సైదిరెడ్డి, మురళి పాల్గొన్నారు

## సెర్ప్ మాదిగ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా వేముల వీరేశం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ సెర్ప్ మాదిగ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అంగీకరించారు.ఈ నేపథ్యంలో సంఘం రాష్ట్ర ఆడ్‌హాక్ కమిటీ కన్వీనర్ బాషపాక చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సంఘ నాయకులు ప్రభుత్వ విప్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా రావాల్సిన హక్కులలో ఉద్యోగులకు మేలు జరిగేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తన పరంగా సంఘానికి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు చేరేలా శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఉద్యోగులను కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గుండ్లపల్లి నరహరి,దాసరి మైసేశ్వరరావు,దాట్ల అయోధ్య,తాటిపాముల సైదులు,కొమ్ము ఇద్దయ్య,కల్లెపురం వినోద్ కుమార్,వంగూరి లక్ష్మయ్య,ఇంద్రకంటి శంకర్, మట్టి ప్రసాద్,గడం యాదగిరి,అల్లంపల్లి స్వాగత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యే బలమైన పునాది



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** పిల్లల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాదని గ్రామ సర్పంచ్ బోరవోలు వెంకట కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎంపిపిఎస్ సోలిపేట పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ చంద్రునాయక్, యాదగిరి, రవి, అంగన్‌వాడీ టీచర్ సరోజ, నాయకులు నర్ర పరమేష్, పోలెపాక శ్యామ్‌సుందర్, వర్కర్లు సుజాత, పద్మ పాల్గొన్నారు.

## పాఠశాల పునఃప్రారంభం



**ప్రజాపక్షం/డిండి;** గత మూడు సంవత్సరాల నుండి మూతబడి ఉన్నటువంటి ఎంపియూపిఎస్ ఖానాపూర్ పాఠశాలను బుధవారం పునః ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉన్నదని గ్రామసర్పంచ్ తిప్పర్తి ప్రతిమ విజయేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న వసతుల గురించి మాట్లాడుతూ అన్ని వనరులను వినియోగించుకొని ఇట్టి అవకాశాన్ని గ్రామంలోని విద్యార్థులు సద్వినియోగించుకొని ఉన్నత ప్రయోజకులు కావాలని ఆమె కోరారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి పగిడిపాటి నర్సింహా, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. పాఠశాలను పునఃప్రారంభించడంతో 20 మంది విద్యార్థులు పాఠశాలలో చేరినట్లు తెలిపారు.